సాక్షి శ్రీకాకుళం

ఆదివారం, 26, జనవరి, 2025

I

కళ్ల ముందే కాలిపోయింది





- శ్రీకాకుళం సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌లో భారీ అగ్ని ప్రమాదం
- షార్ట్ సర్క్యూట్ వల్లనే ఘటన
- 10 అగ్నిమాపక శకటాలతో 9 గంటల పాటు శ్రమించిన 80 మంది సిబ్బంది
- రూ.కోట్లలోనే నష్టం


శ్రీకాకుళం క్రైమ్ :

జిల్లా కేంద్రంలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో శనివారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రాణనష్టమైతే జరగలేదు కానీ ఆస్తినష్టమైతే భారీగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మంటలు ఆర్పేందుకు సుమారు తొమ్మిది గంటల సేపు సాగిన ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో విశాఖ నుంచి వచ్చిన బ్రోన్టో స్కై లిఫ్ట్ యంత్రం సహా పది యంత్రాలు, రెండు క్రేన్లు, మూడు జేసీబీలు, 80 మంది ఫైర్ సిబ్బందితో పాటు రీజనల్ అగ్నిమాపక అధికారి డి.నిరంజన్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి జె.మోహనరావు, టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానంద, జిల్లా అగ్నిమాపక సహాయాధికారి వరప్రసాదరావు తీవ్రంగా శ్రమించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న సీపీయూలో విద్యుత్ షార్ట్‌షర్క్యూట్ అవ్వడంతోనే ఈ ప్రమాదం సంభవించిందని డీఎఫ్ఓ మోహనరావు అన్నారు.

ప్రమాదం ఇలా..

శనివారం ఉదయం 7.55 గంటలకు..
షాపింగ్‌మాల్‌లో ఫైర్ అలారమ్ మోగింది. నైట్ వాచ్‌మెన్‌గా ఉన్న కనకం మోహన్‌కుమార్, విజయ్‌కుమార్‌లు కుడివైపున ఉండే షాపింగ్‌మాల్ గోడవైపు చూడగా ఏసీ బాక్స్ ఉండే వైపు నుంచి పొగలు రావడం గుర్తించారు. వెంటనే తమ సూపర్ వైజర్ వై.రమణకు ఫోన్ చేసి చెప్పారు. అతను మేనేజర్ ఉమామహేశ్వరరావు, సురేష్‌లకు ఫోన్ చేసి చెప్పడంతో అంతా అక్కడకు చేరుకున్నారు.

ఉదయం 8:19 గంటలకు..
ఫైర్‌స్టేషన్‌కు కాల్ వెళ్లింది. రెండు నిమిషాల్లోనే రెండు అగ్నిమాపక శకటాలతో ఏడీఎఫ్ఓ వరప్రసాద్ తమ సిబ్బందితో పాటు వచ్చారు. ముందుగా విషయాన్ని తెలుసుకున్న అధికారులు మాల్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది నిచ్చెనలు వేసుకుని ఫస్ట్‌ఫ్లోర్‌లో చూశారు.



స్కైలిఫ్ట్ యంత్రంతో షాపింగ్ మాల్ పైకి వెళ్తున్న సిబ్బంది

ఏదీ భద్రత..?

గ్రౌండ్‌ఫ్లోర్‌లో ప్రధాన ద్వారం తప్ప వెలుపలకు వెళ్లే (ఎగ్జిట్) మార్గం లేకపోవడం, మాల్‌కుడివైపున రక్షణగోడకు, మాల్ గోడకు డిస్టెన్స్ కూడా 12 నుంచి 15 అడుగులే ఉండటంతో లోపలికి శకటాలు వెళ్లవని అధికారులు గుర్తించారు. అంతేకాక కుడి, ఎడమ, వెనుక భాగం గోడలు క్లోజ్ చేసి ఉండటం, వెంటిలేషన్‌కు కూడా అవకాశం లేకపోవడంతో లోపలికి గాలి వెళ్లలేక బయటకు పొగ వస్తుందని, మంటలు సంభవించి ఉంటాయని అప్పటికే అంచనాకు వచ్చారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఫైర్‌కు సంబంధించి జనరేటర్ ఉన్నా దానికి సంబంధించి నీటి వాల్వ్‌లు పై ఫ్లోర్‌లో ఉండి అవి క్లోజ్ అవ్వడం, మెట్లు మార్గం మూడు ఫ్లోర్లకే ఉండటం ఇవన్నీ, కనీసం ఇసుకను నింపే బకెట్లు లేకపోవడం ఫైర్ సేఫ్టీ లోపం కొట్టొచ్చినట్లు అధికారులకు కనిపించాయి.

మరికొన్ని యంత్రాలతో..

ముందుగా గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న గ్లాసెస్ బద్దలుగొట్టగా ఉవ్వెత్తున పొగలు బయటకు రావడం మొదలయ్యాయి. లోపలకు ఎవరూ వెళ్లలేకపోయారు. అప్పటికే టౌన్ డీఎస్పీ వివేకానంద, సీఐ ఈశ్వరరావులు మూడు జేసీబీలు తెప్పించి మొదటి ఫ్లోర్‌లోని గ్లాసెస్ బద్దలుగొట్టారు. గోడను, పక్క గోడను విరగ్గొట్టడం మొదలు పెట్టారు.

మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది (ఇన్‌సెట్లో) షాపింగ్‌మాల్ లోపల మంటల్లో కాలిపోతున్న బట్టలు

సరిగ్గా 10:15 గంటలకు గ్రౌండ్‌ఫ్లోర్‌లో మంటలు ఎగిసిపడటం కనిపించాయి. అప్పటికే నాలుగు ఫైరింజిన్లు, ఒక రెస్క్యూ టెండరింగ్ ఇంజిన్ మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నా ఫలితం కనిపించలేదు. ఉదయం 11:30 గంటలకు స్కై లిఫ్ట్ వచ్చింది. అప్పటికే నరసన్నపేట, ఆమదాలవలస, రణస్థలం నుంచి ఫైరింజిన్లు రావడం, సరిగ్గా 11:30 గంటలకుబ్రోన్టో స్కైలిఫ్ట్ యంత్రాన్ని వెంటపెట్టుకుని ఆర్ఎఫ్ఓ నిరంజన్‌రెడ్డి పదిమంది సిబ్బందితో సహా విశాఖపట్నం నుంచి వచ్చారు.

ఆస్తినష్టం ఇదేనా..

గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే మంటలు చెలరేగడం, మిగతా మూడు ఫ్లోర్లకు పొగలు వ్యాపించడంతో గ్రౌండ్ ఫ్లోర్‌లోనే బట్టలు కాలాయని, మిగతా ఫ్లోర్లలో కాలలేదని డీఎఫ్ఓ మోహనరావు అన్నారు. కాకపోతే అంతా పొగమయమైందన్నారు. యాజమాన్యం ఫిర్యాదు ఇవ్వకపోవడంతో ఇంకా ఆస్తినష్టం అంచనా వేయలేదని చెప్పారు. పక్కనే ఉన్న సీఎంఆర్, ఆర్‌కే తదితర షాపింగ్‌మాల్స్‌లో ఉన్న సిబ్బంది ఘటనాస్థలికి వచ్చి కాలిన బట్టలను బయటకు తీసేందుకు సహకరించారు.

స్కైలిఫ్ట్ పనిచేసిందిలా..

సుమారు 36 అంతస్తుల (90 మీటర్లు) పైభాగానికి వెళ్లే సామర్థ్యం ఉన్న ఈ స్కై లిఫ్ట్ యంత్రానికి సంబంధించి 10 మంది సిబ్బంది వచ్చారు. లీడింగ్ ఆపరేటర్ సతీష్, మరికొందరు అంతస్తుపై భాగం వరకు వెళ్లి అందులో ఎవరు చిక్కుకున్నదీ, లేనిదీ ముందుగా గమనించారు. అనంతరం 11:55 గంటలకు వేరే నీటి శకట యంత్రానికి డెలివరీ ఓజ్ బిగించి దాని ద్వారా మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ గ్రౌండ్‌ఫ్లోర్‌లో మంటలు అదుపులోకి రాకపోవడంతో క్రేన్ సాయంతో గోడ విరగ్గొట్టారు. ఆపసోపాలు పడుతూ మొత్తానికి గ్రౌండ్‌ఫ్లోర్‌లో మంటలను ఆపగలిగారు. చివరకు ఎట్టకేలకు సాయంత్రం 5:30 గంటలకు మంటలను అదుపులోకి తేగలిగారు.



పొగ బయటకు వెళ్లే యంత్రాన్ని తీసుకువస్తున్న ఫైర్ సిబ్బంది

వినూత్న భారతం



గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆమదాలవలస మండలం వెదుళ్లవలస ఎంపీయూపీ స్కూల్‌లో శనివారం నూలు సంచులు, సేంద్రియ ఎరువులను ఉపయోగించి వినూత్న రీతిలో భారతదేశ చిత్రపటాన్ని తయారు చేశారు. గ్రామస్తులందరినీ పిలిపించి పాలిథీన్ సంచులకు బదులు వస్త్ర సంచులు వినియోగించాలని, అలాగే సేంద్రియ ఎరువులు వాడాలని కోరారు.

– ఆమదాలవలస

అవార్డు స్వీకరణ



అవార్డును అందుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఎన్నికల అధికారిగా అవార్డు లభించింది. 2024 ఓటర్ల జాబితా రూపకల్పనలో, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో అత్యుత్తమ పని తీరు కనబరిచినందుకుగాను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చేతుల మీదుగా శనివారం విజయవాడలో అవార్డును ప్రదానం చేశారు. ఆయనతో పాటు శ్రీకాకుళం తహసీల్దార్ సీహెచ్ గణపతి, పలాస బీఎల్ఓ ఐ.నీలవేణి, శ్రీకాకుళం బీఎల్ఓ వంజరాపు జగన్నాథరావు, కలెక్టరేట్ సి సెక్షన్ టెక్నికల్ సపోర్టర్ ఎం.సత్యనారాయణ కూడా ఉన్నారు.

రిపబ్లిక్ డే వేడుకలకు సర్వం సిద్ధం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ అహ్మద్ ఫర్మాన్‌ఖాన్

శ్రీకాకుళం న్యూకాలనీ, శ్రీకాకుళం పాతబస్టాండ్: రిపబ్లిక్ డే వేడుకలకు సర్వం సిద్ధమైంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్)కళాశాల మైదానం వేదికగా ఆదివారం జరిగే ఈ వేడుకలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 9 గంటలకు కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ శనివారం పరిశీలించారు.

'ఉత్తమ'జాబితా సిద్ధం
రిపబ్లిక్ డే సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలను అందించిన ఉద్యోగులకు అవార్డులు ప్రదానం చేయనున్నారు. ఈ ఏడాది జిల్లాలో 81 శాఖల నుంచి 235 మంది ఉద్యోగులకు అవార్డులు అందజేయనున్నారు. వీరిలో జిల్లా అధికారులు 13 మంది. ఎన్జీవోల నుంచి మరో ఇద్దరికి అవార్డులు ఇవ్వనున్నారు.

గంగపుత్రులపై క్షుద్ర రాజకీయం



చేపల వలలు కోసేసి చిందరవందరగా పడేసిన దృశ్యం

- ముప్ఫై ఏళ్లుగా రింగ్ వలలే జీవనాధారంగా బతుకుతున్న మత్స్యకారులు
- రాజకీయ కక్షతో వలల కత్తిరింపునకు పాల్పడిన వైనం
- పెద్దగళ్లవానిపేటలో మత్స్యకారుల ఆవేదన
- గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తామన్న మత్స్యకారులు

శ్రీకాకుళం రూరల్:

రాజకీయ కక్ష సాధింపులు నాయకులను దాటి సామాన్యుల వరకు చేరుకున్నాయి. రాజకీయ కారణాలు చూపి గ్రామాల్లో చోటా నేతలు సామాన్యులను వేధించడానికి పూనుకుంటున్నారు. శ్రీకాకుళం మండల పరిధిలోని పెదగనగళ్లవానిపేట పంచాయతీ పరిధిలో మత్స్యకారులకు జీవనాధారమైన చేపల వేటపై అధికార పక్ష నాయకుడు క్షుద్ర రాజకీయం చేస్తున్నాడు. ఉద్దేశపూర్వకంగా అధికారులకు ఫిర్యాదులు చేసి వారిని ఉసిగొల్పి మత్స్యకారులు వేట చేయకుండా ఆపించేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా లేని ఆంక్షలు కేవలం పెదగనగళ్లవానిపేటకు చెందిన మత్స్యకారులపై అధికారులు పెట్టడంతో ఆ తీర ప్రాంతవాసులంతా రోడ్డున పడ్డారు.

జిల్లాలోని మత్స్యకార ప్రాంతాలైన రణస్థలం, కె.మత్స్యలేశం, వజ్రపుకొత్తూరు, భావనపాడు, మంచినీళ్లపేట, ఏడుళ్లపేట, గద్దెలపాడు తదితర మత్స్యకార ప్రాంతాలైన గ్రామాల్లోని గంగపుత్రులు రింగ్ వలలతోనే చేపల వేట సాగిస్తున్నారు. కర్ణాటక, మంగుళూరు, కేరళ, తమిళనాడు, గుజరాత్ ప్రాంతాల్లో సైతం రింగ్ వలలనే వాడుతున్నారు. పెదగనగళ్లవానిపేటలోనూ రింగ్ వలలతోనే ముప్పై ఏళ్లుగా చేపల వేట చేస్తున్నారు. అయితే ఇటీవల టీడీపీ నాయకుడి ఆధ్వర్యంలో కొందరు రింగ్ వలలు ఉపయోగించకూడదని ఆదేశం ఇచ్చారు. కానీ మిగతా వారు ఆ మాటలు పట్టించుకోకుండా రింగ్ వలలు వాడుతుండడంతో మత్స్యశాఖ అధికారులకు టీడీపీ నాయకుడు ఫిర్యాదు చేశాడు. రెండు వర్గాల మధ్య గొడవలు జరుగుతుండడంతో మత్స్యశాఖ అధికారులు కూడా రింగ్ వలలు వాడకూడదని నిషేధం విధించారు. అయితే జిల్లాలో ఎక్కడా లేని విధంగా తమకే ఎందుకు ఆంక్షలు పెడుతున్నారని వారు ప్రశ్నించినా ఎవరూ స్పందించలేదు. దీంతో వారు మళ్లీ వేటకు వెళ్లగా.. సముద్రంలో వారిని అడ్డుకుని వలలు కోసేశారు. ఫలితంగా వారం రోజులుగా వేట లేదు.

కక్షపూరితం



స్థానికంగా ఉన్న సర్పంచ్ రామారావు మా వర్గానికి చెందిన వారిపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నాడు. గార మండలం, బలరామపురం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులను మా ఊరికి తీసుకువచ్చి దౌర్జన్యానికి పాల్పడ్డారు. మా వలలను బలవంతంగా కత్తిరించి పట్టుకుపోయారు. ఒక్కో వలపై 20 కుటుంబాలు బతుకుతున్నాం.

– మైలపల్లి మూర్తి, రామనర్సయ్యపేట

గ్రామంలో తగాదాలు జరుగుతున్నాయి

రెండు వర్గాల మత్స్యకారుల మధ్య తగాదాలు జరుగుతున్నాయి. కొన్ని రోజుల వరకూ చేపల వేటకు వెళ్లొద్దని ఆదేశాలు జారీ చేశాం. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెడతాం. రింగ్ వలల నిషేధం కొన్ని చోట్ల ఉంది. చాలా చోట్ల లేదు. ఈ రింగ్ వలల వల్లే పెదగనగళ్లవానిపేటలో తగాదాలు జరుగుతున్నాయి.

– పీవీ శ్రీనివాస్, డీడీ ఫిషరీస్

చంపేసి.. బంగారం దోచుకుని

- న్యూకాలనీ వివాహిత హత్య కేసు ఛేదన
- పథకం ప్రకారం హత్య చేసిన నిందితుడు శరత్‌కుమార్
- హత్య చేశాక ఒంటిపై బంగారం తీసుకుని పరారీ



వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ కె.వి.రమణ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలో సంచలనం సృష్టించిన వివాహిత హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. పొందూరు మండలం మొదలవలస గ్రామానికి చెందిన పూజారి కళావతి (53) ఒంటిపై ఉన్న బంగారు నగల కోసమే నగరానికి చెందిన అండలూరి శరత్‌కుమార్ (31) పథకం ప్రకారం హత్య చేశాడని పోలీసులు నిర్ధారించారు. శనివారం మధ్యాహ్నం జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.వి.రమణ, టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానందలు వివరాలు వెల్లడించారు.

నిండా అప్పులు.. ఆపై వ్యసనాలు
శ్రీకాకుళానికి చెందిన అండలూరి శరత్‌కుమార్ (31) తల్లిదండ్రులతో తగువులాడుకుని ఇంటి నుంచి బయటకొచ్చేశాడు. సరస్వతీ మహల్ ఎదురుగా ఏవీఆర్ జనరేటర్ రిపేర్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తూ.. న్యూకాలనీలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. వ్యసనాలకు తోడు జల్సాలు ఎక్కువగా చేసేవాడు.

పథక రచన చేశాడిలా..
నగరంలోని డీసీసీబీ కాలనీలో సూరిబాబు సుందర సత్సంగానికి పొందూరు నుంచి కళావతి భజనలు, కీర్తనలు వినడానికి వచ్చేవారు. ఏడాది కిందట శరత్‌కుమార్‌కు కళావతి పరిచయమైంది. సత్సంగానికి ఎప్పుడొచ్చినా ఒంటి నిండా బంగారు ఆభరణాలతో కళావతి కనిపించేవారు. దీంతో తన అప్పులు తీర్చేందుకు ఆమెను హతమార్చి బంగారాన్ని కాజేయాలని శరత్‌కుమార్ పథక రచన చేశాడు. ఈ క్రమంలో ఈ నెల 18న కళావతి రూమ్‌కి వస్తున్నట్లు శరత్‌కుమార్‌కు ఫోన్ చేయడంతో హత్య చేయడానికి సరైన సమయమిదేనని భావించాడు. కళావతి మధ్యాహ్నం మూడు గంటలకు గదికి వచ్చారు. ఇదివరకు శరత్‌కుమార్ ఆమెకు వెయ్యి రూపాయలు ఇవ్వాల్సి ఉంది. కానీ అతడు రూ.500 మాత్రమే ఇవ్వడంతో మిగతా రూ.500 కోసం వాదులాడుకున్నారు. ఈ క్రమంలో కళావతి శరత్‌కుమార్ తల్లినుద్దేశించి అనరాని మాట అనడంతో కోపోద్రిక్తుడైన శరత్‌కుమార్ వైరుతో ఆమె గొంతు బిగించి తలగడతో గట్టిగా ముఖాన్ని అదిమి చంపేశాడు. వెంటనే ఆమె ఒంటిపై ఉన్న బంగారు గాజులు రెండు, పుస్తెలతాడు, నాలుగు ఉంగరాలు, ఓ చెవిదిద్దు, సెల్‌ఫోన్లు రెండు తీసుకున్నాడు. శవాన్ని పక్కనే ఉన్న బాత్‌రూమ్‌లోకి ఈడ్చుకువెళ్లి అక్కడ పడేశాడు. గాజులు రెండూ తన వద్ద ఉంచుకుని మిగతా వస్తువులను ఒక పాలిథీన్ కవర్‌లో కట్టి ఇంటి మెట్ల కింద పెట్టి రూమ్‌కి తాళాలు వేసి అక్కడి నుంచి పరారయ్యాడు.

తన స్నేహితుడి ఇంటిలో ఓ రాత్రి, ఆదిత్య పార్క్‌లో రెండు రాత్రులు గడిపాడు. సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి అక్కడే ఆగి ఉన్న లారీపైకి విసిరేశాడు. తానే చంపానని బయటకు తెలిసిపోవడంతో 24న బాకర్ సాహెబ్‌పేట వీఆర్వో స్పందన అనూష వద్దకు వెళ్లి జరిగిందంతా చెప్పి ఆమె సమక్షంలో పోలీసులకు లొంగిపోయాడు. వేరే వ్యక్తికి అమ్మజూపిన రెండు గాజులనే కాక మెట్లపై దాచి ఉన్న మిగతా బంగారు వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

వృత్తి విద్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని ఎన్టీఆర్ నైపుణ్య కేంద్రం (మహిళా ప్రాంగణం)లో వృత్తి విద్య శిక్షణకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేనేజర్ పి.విమల శనివారం ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ శిక్షణ రెండు నెలలు ఉంటుందని, 10వ తరగతి ఉత్తీర్ణత, 18 నుంచి 35 ఏళ్ల అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. టైలరింగ్‌కు ఎనిమిదో తరగతి ఉత్తీర్ణత అర్హత కాగా, 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, 18 నుంచి 35 ఏళ్ల వారు అర్హులని తెలిపారు. ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9948530183, 7416764419 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

కుంభమేళాలో అర్చకుడి మృతి


సుసరాపు వెంకట నరసింహం (ఫైల్)

పోలాకి: మండలంలోని ప్రియాగ్రహారం శివాలయం ప్రధాన అర్చకుడు సుసరాపు వెంకటనరసింహం అలియాస్ చిన్నబాబు(65) శనివారం మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ నెల 21న ప్రయోగరాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు కుటుంబసభ్యులతో వెళ్లిన వెంకటనరసింహం అక్కడి నుంచి వారణాశి తదితర క్షేత్రాల సందర్శనకు వెళ్లారు. అక్కడి అతిశీతల వాతావరణం నేపథ్యంలో శ్వాసకోశ సమస్యతో బాధపడి మృతిచెందారు. కాశీలోనే అంత్యక్రియల ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

సైన్స్‌ఫెయిర్‌లో సత్తాచాటిన పలాస విద్యార్థి


బహుమతి అందుకుంటున్న జశ్వంత్ పాత్రో

కాశీబుగ్గ/శ్రీకాకుళం న్యూకాలనీ: పలాస హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న జశ్వంత్ పాత్రో ప్రతిభ కనబరిచాడు. తాను తయారు చేసిన రీజనరేట్ బ్రేకింగ్ సిస్టమ్స్ ప్రాజెక్టుకు పుదుచ్చేరిలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ – 25లో మూడో స్థానం దక్కింది. స్పీకర్, మంత్రుల చేతులమీదుగా ట్రోఫీ, సర్టిఫికెట్, నగదు బహుమతి అందుకున్నట్లు హెచ్‌ఎం దాశరథి శనివారం తెలిపారు. విద్యార్థితో పాటు గైడ్ టీచర్ షణ్ముఖరావును అభినందించారు.

యువకుడు ఆత్మహత్య

గార: కడుపు నొప్పి తట్టుకోలేక కుమ్మరిపేట గ్రామానికి చెందిన కె.శ్రావణ్‌కుమార్ (32) ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను ఎచ్చెర్ల ఐఐఐటీలో ఔట్‌సోర్సింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నిరోజులుగా కడుపునొప్పి సమస్యతో బాధపడుతున్నాడు. శనివారం పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆర్.జనార్దన తెలిపారు.

కవిటి సర్పంచ్‌కు విశిష్ట ఆహ్వానం


పూడి లక్ష్మణరావు

కవిటి: తన పంచాయతీని అభివృద్ధిలో అగ్రపథంలో నిలిపిన కవిటి మేజర్ పంచాయతీ సర్పంచ్ పూడి లక్ష్మణరావుకు అరుదైన అవకాశం లభించింది. ఈ ఏడాది న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు హాజరు కావాలని పూడి లక్ష్మణరావుకు ఆహ్వానం వచ్చినట్లు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి సమాచారం అందిందని ఈఓపీఆర్డీ భద్రస్వామి తెలిపారు. ఈ గౌరవం తనకు లభించడంపై కవిటి మేజర్ పంచాయతీ సర్పంచ్ లక్ష్మణరావు ఆనందం వ్యక్తం చేశారు.

టీడీపీ మాజీ సర్పంచ్‌పై అట్రాసిటీ కేసు నమోదు

కొత్తూరు: కొత్తూరు మండలం మదనాపురం టీడీపీ మాజీ సర్పంచ్ అగతమూడి మాధవరావు, జంక కృష్ణమూర్తిలపై లిమ్మక దేవిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎండీ అమీర్ ఆలీ శనివారం తెలిపారు. భూ సమస్య పై మాధవరావు, కృష్ణమూర్తిలు ఇంటికి పిలిచి కులం పేరుతో దూషించినట్లు లిమ్మక దేవిక ఫిర్యాదులో తెలిపినట్లు ఎస్‌ఐ చెప్పారు. ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

ఖాతాలన్నీ ఖాళీ | నిధులన్నీ లూటీ!

- అరసవల్లి ఆదిత్యాలయంలో ఆరు నెలలకే వార్షిక బడ్జెట్ ఖాళీ
- రెగ్యులర్ సిబ్బంది జీతాలు మినహా మిగిలిన ఖాతాల్లో సొమ్ములు నిల్
- కాంట్రాక్ట్ ఉద్యోగి జగన్మోహనరావుపైనే అనుమానాలు
- ఇప్పటికే రెండు నెలల జీతం కట్
- సమగ్ర విచారణ కోరుతూ విజిలెన్స్‌కు ఫిర్యాదుల వెల్లువ

అరసవల్లి: 'గోశాలలో ఆవులకు మేతగడ్డి కొనడానికి డబ్బులు లేవు.. అన్నదానానికి కొన్న కూరగాయలకు ఇవ్వడానికి డబ్బులు లేవు.. ఇతరత్రా సామగ్రి కొనుగోలుకు హెడ్ ఖాతాల్లో పైసా లేదు..'' ఇదీ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ప్రస్తుత పరిస్థితి. అరసవల్లి ఆలయానికి డిప్యూటీ కమిషనర్ (డి.సి) హోదాతో అప్‌గ్రేడ్ చేయడంతో ఉద్యోగుల సంఖ్య పెరగడంతో పాటు ఆలయంలో స్వామి వారి సేవలు, కైంకర్యాలు, దినసరి వేతనదారులు, ఇతరత్రా సౌకర్యాల కల్పనకు, పరిపాలనాంశాలకు గాను 2024–25 వార్షిక బడ్జెట్‌ను సుమారు రూ.22 కోట్లకు దేవదాయ శాఖ కమిషనరేట్ నుంచి ఆమోదం పొందారు. ఈ మొత్తాన్ని హెడ్‌ల వారీగా ఏడాది పాటు ఖర్చు చేయాల్సి ఉండగా ప్రస్తుతం ఆరేడు నెలలకే నిధులు ఖాళీ అయిపోవడం చర్చనీయాంశమైంది. దీనంతటికీ క్యాష్‌బుక్‌ను మెయింటైన్ చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగి (గ్రేడ్–2 ఈవో) పి.జగన్మోహనరావే కారణమని, ఇతనికి రెగ్యులర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఓ ఉద్యోగి కూడా సహకరించినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

రిటైర్డ్ ఉద్యోగి చేతిలో క్యాష్ బుక్..!

నిన్నటి వరకు దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్‌గా పనిచేసిన ఎస్.సత్యనారాయణ తనకు సమీప బంధువంటూ రిటైర్డ్ ఉద్యోగి జగన్మోహనరావు ఆలయంలో కన్సాలిడేటెడ్ ఉద్యోగిగా చేరి అజమాయిషీ చెలాయించారు. కార్యనిర్వహణాధికారులు ఎవరున్నా కీలకమైన అకౌంట్స్, క్యాష్ బుక్ మాత్రం తనవద్దే ఉంచుకుంటూ లావాదేవిలు కొనసాగించారు. ఇష్టారాజ్యంగా ఖర్చులు చేసేసి తప్పుడు బిల్లులతో ఆడిట్‌కు పంపించేయడంతో చాలావరకు హెడ్‌లు ఖాళీలయ్యాయి. 2024–25 వార్షికంలో తొలి నెలల్లో పనిచేసిన ఈవోల హయాంలో దొంగబిల్లులను పెట్టడం, అధిక ఖర్చులు చేసినట్లు ఆరోపణలున్నాయి. కన్సాలిడేటెడ్ ఉద్యోగుల జీతభత్యాలు చెల్లించే హెడ్ కూడా ఖాళీ కావడంతో రెండు నెలలుగా జగన్మోహనరావుకు కూడా జీతాలు ఆపేశారు.

విజిలెన్స్‌కు ఫిర్యాదులు..

అరసవల్లిలో జరిగిన పలు అక్రమాలపై రిటైర్డ్ ఉద్యోగి పి.జగన్మోహనరావు, అప్పటి ఈవో చంద్రశేఖర్, కంప్యూటర్ ఆపరేటర్ బి.యుగంధర్‌లపై ఇప్పటికే విజిలెన్స్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఆడిట్‌కు దొరక్కుండా దొంగ బిల్లులతో అక్రమాలు, ఈవో చంద్రశేఖర్‌కు ఇతోధికంగా సాయం చేసేందుకు ఆలయ నిధులను వినియోగించడంపై జగన్మోహన్‌రావుపై ఫిర్యాదు పంపించారు. గత ఈవో చంద్రశేఖర్ హయాంలో చెక్కులు డ్రా చేసిన తేదీలు, ఆడిట్‌కు సబ్‌మిషన్ తేదీల వ్యత్యాసాలపై ఫిర్యాదులు వెళ్లాయి. వీటితో పాటు ఫోర్జరీ సంతకంతో ఉద్యోగం చేస్తున్నాడంటూ కంప్యూటర్ ఆపరేటర్ యుగంధర్‌పై కూడా ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణలో భాగంగా పాత్రధారులను నేరుగా విజిలెన్స్ అధికారులే పిలుపించుకుని విచారణ చేపట్టినట్టు సమాచారం. మొత్తం అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని భక్తులు కోరుతున్నారు.

ఆరు నెలల్లో అంతా ఖాళీ..


అరసవల్లి ఆదిత్యాలయం

అరసవల్లి ఆదిత్యాలయంలో సుమారు 38 రకాల వివిధ హెడ్‌లు క్రింద స్వామి వారి కైంకర్యాలు, పరిపాలనాంశాలు నడుస్తాయి. ఇందుకోసం 2024–25 వార్షిక బడ్జెట్ సుమారు రూ.22 కోట్లు మంజూరు చేయించుకున్నారు. ఇందులో ప్రధానంగా రెగ్యులర్, కాంట్రాక్ట్ సిబ్బంది జీతాలకు రూ.2.20 కోట్లు, అన్నదానానికి రూ.1.20 కోట్లు, ప్రసాదాల తయారీకి రూ.2 కోట్లు, చైత్ర మాసంలో ఆదిత్యుని వార్షిక కల్యాణం, వైశాఖ మాసం, కార్తీక మాసం, తెప్పోత్సవం, వైకుంఠ ఏకాదశి, రథసప్తమి, మాఘమాసం తదితర పర్వదినాల నిర్వహణ ఏర్పాట్లకు సుమారు రూ.1.50 కోట్లు వరకు వార్షికంగా బడ్జెట్ ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే గత ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ నెలాఖరు నాటికే బడ్జెట్ హెడ్‌లన్నీ దాదాపుగా ఖాళీలయ్యాయి. లెక్కలను తారుమారు చేయడం, నిర్వహణ పనులంటూ చాలా వరకు బిల్లులు పెట్టి అన్నదానం, ప్రసాదాల హెడ్‌లన్నీ ఖాళీ చేసేశారు. దీంతో సెప్టెంబర్ నుంచి అన్నదానానికి గాను కూరగాయల సరఫరా వ్యాపారికి బకాయిలు రూ.4 లక్షలు, వస్త్రాలు, కండువాల విక్రయ దుకాణానికి రూ.లక్ష, వివిధ ఫర్నిచర్ షాపులకు రూ.2 లక్షల వరకు, ఆవుల మేత గడ్డి కోసం రూ.25 వేల వరకు బకాయిలున్నట్లు సమాచారం.

- కొన్ని నెలల ముందు వరకు పనిచేసిన ఈవో చంద్రశేఖర్ హయాంలో కేవలం 20 రోజుల్లోనే సుమారు రూ.6 లక్షల వరకు ఖర్చు చేసినట్లుగా తర్వాత విధుల్లోకి వచ్చిన ఈవో రమేష్‌బాబు గుర్తించి ఆ ఖర్చుల బిల్లులపై అభ్యంతరాన్ని వ్యక్తం చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.
- పాలు, మజ్జిగ పంపిణీ, ప్రసాదాల పంపిణీ, మంచినీటి ప్యాకెట్లు రూపేణా రూ.25 లక్షల వరకు ఖర్చులకు ప్రీ ఆడిట్‌కు పంపించకుండా చెక్కులను డ్రా చేసేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో అప్పటి ఈవోలకు చేతిడబ్బులు ఇవ్వడంతో పాటు అదనంగా జేబులు నింపుకున్నట్లుగా రిటైర్డ్ ఉద్యోగి జగన్మోహనరావుపై ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- ఇతర దేవాలయం నుంచి వచ్చి ఇక్కడ డిప్యుటేషన్‌లో పనిచేసిన ఉద్యోగులకు పీఆర్సీ వర్తింపు కింద చెల్లింపులు, ఎరియర్స్‌తో కలిపి రూ.లక్షల్లో చెల్లించడం కూడా కూడా బడ్జెట్‌కు భారమయ్యిందనే వాదనలున్నాయి.

హెడ్‌లు ఖాళీ అయినట్లు గుర్తించాం..



నేను విధుల్లోకి రాకమును పే.. వార్షిక బడ్జెట్ హెడ్‌లో చాలా వరకు ఖర్చులైనట్లు చూపిస్తున్నారు. ఈ లోటు కారణంగా చాలా వరకు బకాయిలు చెల్లించలేకపోతున్నాం. కన్సాలిడేటెడ్ ఉద్యోగి జగన్మోహనరావుకు కూడా రెండు నెలల నుంచి జీతాలు చెల్లింపు నిలిపేశాం. తదుపరి సప్లమెంటరీ బడ్జెట్ పెట్టాల్సి ఉంది. అప్పుడే జీతాలు, బకాయిల సంగతి తేలుతుంది. విజిలెన్స్‌కు ఫిర్యాదులు వెళ్లిన అంశం కూడా నా దృష్టికి వచ్చింది.

– వై.భద్రాజీ, ఆలయ ఈవో, అరసవల్లి

దావోస్ పేరిట రూ.90 కోట్లు వృథా


చింతాడ రవికుమార్

ఆమదాలవలస: దావోస్ పర్యటనకు సుమారు నెలరోజుల ముందు నుంచే చంద్రబాబు, ఎల్లో మీడియా హడావుడి చేసిందని, తీరా చూస్తే దావోస్ నుంచి రిక్తహస్తాలతో చంద్రబాబు వెనుదిరిగారని, సుమారు రూ.90 కోట్ల ఖర్చు బూడిద పాలైందని ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పక్క రాష్ట్రం తెలంగాణ సుమారు రూ.లక్షా35 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించగలిగిందని, మన రాష్ట్రంలో చంద్రబాబు కక్ష సాధింపులపై పెట్టిన శ్రద్ధ పాలనపై చూపడం లేదన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన మొదటి ప్రయత్నంలోనే సుమారు రూ. లక్షా 70 వేల కోట్ల పెట్టుబడులు సాధించారని గుర్తు చేశారు. అప్పట్లో పవన్ కల్యాణ్ స్పందిస్తూ స్వదేశీ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకోవడానికి రూ.కోట్లు ఖర్చుపెట్టి దావోస్ వరకు వెళ్లాలా! అంటూ ఎద్దేవా చేశారని, మరి ఏ ఒప్పందాలు లేకుండా సుమారు రూ.90 కోట్లు ఖర్చు పెట్టి రిక్త హస్తాలతో తిరిగొచ్చిన చంద్రబాబుపై ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

రాజశేఖరం జీవితం ఆదర్శప్రాయం


పాలవలస రాజశేఖరం చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్

పాలకొండ/వీరఘట్టం/రణస్థలం/కవిటి: రాజకీయ కురువృద్ధుడు పాలవలస రాజశేఖరం నేటి తరం రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయులని శాసన మండలి విపక్షనేత, ఎమ్మెల్సీ బొత్స సత్యన్నారాయణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శనివారం పాలకొండలో రాజశేఖరం సంతాపసభ నిర్వహించారు. మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు కోలగట్ల వీరభద్రస్వామి, రఘురామ కృష్ణరాజు, నర్తు రామారావు, కంభా రవిబాబు, మాజీ ఎంపీలు బెల్లాన చంద్రశేఖర్, గొడ్డేటి మాధవి, మాజీ ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు, అలజంగి జోగారావు, శంబంగి చినప్పలనాయుడు, గొర్లె కిరణ్‌కుమార్, కె.భాగ్యలక్ష్మి, బడుకొండ అప్పలనాయుడు, రాజాం వైఎస్సార్‌సీపీ కన్వీనర్ తలే రాజేష్, అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, శోభా హైమావతి తదితర ప్రముఖులు హాజరై నివాళులు అర్పించారు. రాజశేఖరం భార్య జెడ్పీటీసీ సభ్యురాలు ఇందుమతి, ఆయన కుమారుడు ఎమ్మెల్సీ విక్రాంత్, కుమార్తె మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. రాజశేఖరంతో ఉన్న పరిచయాలను, అనుబంధాలను గుర్తు చేసుకున్నారు.


కవిటి: రాజశేఖరం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు


రణస్థలం: రాజశేఖరం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రిమ్స్ రోగులకు ఎంఆర్‌ఐ కష్టాలు

- మెదడు సంబంధిత రోగికి స్కానింగ్ చేయకుండానే డిశ్చార్జి
- అధికారులకు ఫిర్యాదు చేశాడని కక్ష


బాధితుడు సింహాచలం

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ సర్వజన ఆసుపత్రికి చికిత్స కోసం వెళ్లే పేద రోగులకు ఎంఆర్‌ఐ(మ్యాగ్నెటిక్ రెసొనెన్స్ ఇమేజింగ్) స్కానింగ్ గగనమవుతోంది. గార మండలం గోరువానిపేటకు చెందిన 54 ఏళ్ల కార సింహాచలం ఈ నెల 16న మెదడు సంబంధిత సమస్యతో రిమ్స్‌కు వచ్చారు. పరిశీలించిన వైద్యులు మరిన్నీ పరీక్షలు అవసరమని, ఇన్‌పేషెంట్‌గా చేర్చారు. ఈ నెల 18న సీటీ స్కాన్ సిఫారసు చేయడంతో 19న స్కాన్ చేయించారు. 20న రిపోర్టు రాగా, అందులో స్పష్టత లేదంటూ ఎంఆర్‌ఐ స్కాన్ చేయించాలని కేసు షీట్‌లో నమోదు చేశారు. ఆ రోజు నుంచి ఎంఆర్‌ఐ స్కాన్ చేయించేందుకు రోగి బంధువులు ఉదయం వస్తే మధ్యాహ్నం రావాలని, మధ్యాహ్నం వస్తే రేపు రావాలని సాగదీత ధోరణితో వ్యవహరించారు. విసిగిపోయిన బంధువులు శుక్రవారం ఆర్‌ఎంవో డాక్టర్ రమేష్‌నాయుడుకు విషయం చెప్పారు. ఆయన స్వయంగా వచ్చి సీటీ స్కాన్ చేయాలని ఆదేశించారు. అయినా సిబ్బంది తాత్సారం చేయడంతో తిరిగి ఆర్‌ఎంవోను ఆశ్రయించారు. రోగి సహకరించడం లేదని, ఎవరైనా సర్జన్ ఉంటే మత్తు ఇచ్చి చేస్తామని చెప్పడంతో ఇదే విషయాన్ని వార్డులో చెప్పారు. శుక్రవారం సాయంత్రం వార్డులోని ఓ స్టాఫ్ నర్సు ఎంఆర్‌ఐ వద్దకు వచ్చి శాంపిల్ డోస్ అంటూ మత్తు మందు ఇచ్చారు. అయినా రోగి కదలడంతో శనివారం రావాలని అక్కడ సిబ్బంది సూచించారు. రోజూ ఏదో సాకు చెబుతున్నారన్న ఉద్దేశంతో రోగి బంధువులు ఉదయం ఆరుగంటలకే వెళ్లి మొట్టమొదటగా రోగికి సంబంధించిన కేసు షీటు ఇచ్చారు. అయినా స్కాన్ చేయకుండా కేసులు ఎక్కువున్నాయని.. సోమవారం రావాలని చెప్పడంతో ఆర్‌ఎంవో, సూపరింటెండెంట్ షకీలాకు విషయాన్ని వివరించారు. ఆమె చెప్పినా అక్కడ ఎంఆర్‌ఐ తీయకుండా అక్కడ ఇన్‌చార్జిగా ఉన్న రఘునాథరావు రోగిని డిశ్చార్జి చేయాలని, వారం రోజుల తర్వాత రావాలని ఆదేశించారు. విషయాన్ని మళ్లీ సూపరిటెండెంట్ దృష్టికి తీసుకెళ్లగా మత్తు నిపుణుల పర్యవేక్షణలో జరగాలని, అందుకే వాయిదా వేసి ఉండవచ్చని చెప్పారు. ఇది వాస్తవమే కాగా శుక్రవారం స్టాఫ్ నర్సు ద్వారా మత్తు ఇంజక్షన్ ఎలా ఇచ్చారన్న ప్రశ్నకు ఆమె నుంచి సమాధానం రాలేదు. తొలుత సోమవారం రావాలని చెప్పిన సిబ్బంది అటు తర్వాత వారం రోజుల తర్వాత రావాలని ఆమె దృష్టికి తీసుకెళ్లగా, అలా జరగకూడదే అంటూ సిబ్బందిని ప్రశ్నిస్తానని చెప్పి వెళ్లిపోయారు. నాలుగేళ్ల క్రితం సింహాచలంకు బ్రెయిన్ స్ట్రోక్ రాగా నెమ్మదిగా కోలుకొని, తిరిగి ఇటీవలే వ్యాధి లక్షణాలతో బాధపడుతున్నారని, మళ్లీ స్ట్రోక్ వస్తే పరిస్థితి ఏంటని కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. గత్యంతరం లేక రోగిని తీసుకొని బంధువులు ఇంటిముఖం పట్టారు. కాగా, ఎంఆర్‌ఐ స్కాన్ వద్ద కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారని పలువురు రోగులు ఆరోపిస్తున్నారు.

ఇసుక ర్యాంపు వద్దే వద్దు


కొబగాంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ వెంకటేశ్వరరావు

నరసన్నపేట: 'కొబగాం–వెంకటాపురంలో ఇసుక ర్యాంపు వద్దు. మాకు ఇబ్బందులు పెట్టకండి. మీకేం.. మీరు చెప్పి వెళ్లిపోతారు. ఇక్కడ అవస్థలు పడాల్సింది మేము' అని కామేశ్వరిపేట, కొబగాం గ్రామస్తులు, నాయకులు ముక్త కంఠంతో అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం కొబగాంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కొబగాం–వెంకటాపురంలో ఇసుక ర్యాంపు ఏర్పాటుకు పర్యావరణ ప్రజాభిప్రాయం సేకరణ జరిగింది. ఇందులో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, కాలుష్య మండలి ప్రతినిధి కురుణ శ్రీ, తహసీల్దార్ సత్యనారాయణలు పాల్గొనగా వీరికి తమ అభిప్రాయాలను స్పష్టంగా గ్రామస్తులు చెప్పారు. ఇసుక తవ్వకాలపై అధికారులు సర్దిచెప్పడానికి చూసినా స్థానికులు ఒప్పుకోలేదు. అంతకు ముందు మడపాంలో ఇసుక ర్యాంపు కోసం కూడా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఎంపీటీసీ రువ్వ వాసు మాట్లాడుతూ గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని, జిరాయితీ పొలాల్లో తోవలు ఇచ్చే వారికి నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. అలాగే గోపి మాట్లాడుతూ యంత్రాలతో ఇసుకను తవ్వ వద్దని కూలీలకు పనులు కల్పించాలని కోరారు.

ఓటు హక్కు అందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న జేసీ, ఎమ్మెల్యే తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటు హక్కు సక్రమంగా వినియోగించుకుంటున్న వృద్ధులను యువత ఆదర్శంగా తీసుకోవాలని అదనపు జిల్లా ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో శనివారం జరిగిన కార్యక్రమానికి శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ముందుగా వివిధ కళాశాలల విద్యార్థులు, ఎన్నికల అధికారులు ర్యాలీ చేపట్టారు. ఏడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించి అనంతరం బాపూజీ కళామందిర్ చేరుకున్నారు. అనంతరం నూతనంగా ఓటు హక్కు కలిగిన యువతీ, యువకులకు ఓటరు కార్డులు అందజేశారు. ప్రతి ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న వయో వృద్ధులకు ప్రశంసా పత్రాలు అందించారు. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగ ఓటర్లను దుశ్శాలువలతో సత్కరించారు.

కార్యక్రమంలో రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం నియోజకవర్గం ఎన్నికల అధికారి సాయి ప్రత్యూష, డీఈఓ తిరుమల చైతన్య, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.వి.వి. డి.ప్రసాద్, అదనపు ఎస్పీ కె.వెంకట రమణ, సెట్‌శ్రీ సీఈఓ ప్రసాదరావు, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, సన్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

నరసన్నపేట: ఊక లారీలో కలాశీగా పనిచేసే ఎలమంచిలి శ్రీనివాసరావు(45) మద్యం మత్తులో మరణించాడు. శనివారం ఉదయం ఆర్టీసీ కాంప్లెక్స్ పైకి వెళ్లే మెట్లు వద్ద మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ దుర్గాప్రసాద్ పరిశీలించారు. మృతుడికి భార్య ధనలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏఎస్‌ఐ సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆచార్య పోస్టుల భర్తీకి మోక్షమెప్పుడో?

- రిమ్స్‌లో 11 ప్రొఫెసర్ పోస్టులు ఖాళీ
- రాష్ట్ర అధికారికి ఐదు నెలల క్రితం సీనియారిటీ జాబితా
- 61 మందిలో ముగ్గురికే పదోన్నతి


శ్రీకాకుళం రిమ్స్

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలలో 11 ఆచార్య (ప్రొఫెసర్) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆరునెలలుగా ప్రభుత్వం పదోన్నతులు చేపట్టకపోవడంతో ఇన్‌చార్జిలతోనే ఆయా విభాగాలు కొనసాగుతున్నాయి. పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్, డెర్మటాలజీ, న్యూరాలజీ, యూరాలజీ, రేడియేషన్ అంకాలజీ, మెడికల్ అంకాలజీ, సర్జికల్ అంకాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, పలమనరి మెడిసిన్, జనరల్ సర్జరిలో ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్నాయి. ఈ విభాగాలన్నీ ప్రస్తుతం అసోసియేట్ ప్రొఫెసర్ల ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి.

గత ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు భర్తీలు..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఎప్పటికప్పుడు పదోన్నతులు, పోస్టుల భర్తీలు జరిగేవి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం తర్వాత పదేళ్లపాటు వైద్యులపదోన్నతి నోచుకోలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాకే రాష్ట్ర వ్యాప్తం ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ అవుతుండేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. పోస్టుల భర్తీ అటకెక్కింది. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు కూడా పది వరకు ఖాళీగా ఉన్నాయి. అంకాలజీలో మూడు, న్యూరాలజీ, న్యూరో సర్జన్, కార్డియాలజీ సర్జన్, బయోకెమిస్ట్రీ, ఎమెర్జన్సీ మెడిసిన్, నెఫ్రాలజీ, జనరల్ కార్డియాలజిస్ట్‌లో ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్నాయి. వీటిని కూడా పదోన్నతిలపై భర్తీ చేస్తే కొంత మేర నిరుద్యోగ సమస్య తీరినట్టు అవుతోంది. వైద్య విద్యార్థులకు మంచి బోధన, రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందే అవకాశం ఉంటుంది. అయినా ప్రస్తుత ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేయడం లేదు.

ముగ్గురికి మాత్రమే..

ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించిన సీనియారిటీ జాబితా ఐదు నెలల క్రితమే రాష్ట్ర అధికారి టేబుల్‌పైకి వెళ్లినట్టు సమాచారం. 61 మంది అర్హులతో జాబితాను సిద్ధం చేశారు. సెప్టెంబర్‌లో జాబితా రూపొందించగా సుమారు 5 నెలల పాటు పెండింగ్‌లో పెట్టేశారు. తాజాగా ఈ జాబితాలో ముగ్గురికి మాత్రమే పదోన్నతులు కల్పించారు. వీరి కంటే సీనియర్లున్నప్పటికీ వారిని పక్కనపెట్టేశారు. రాష్ట్ర చరిత్రలో ఇలా జరగడం తొలిసారని వైద్యులు చెబుతున్నారు. రిమ్స్ వైద్య కళాశాలలో పదోన్నతులకు అర్హులైన వారు ఐదుగురు వరకు ఉన్నారు. ఇదంతా పదోన్నతులు కోసం ఎదురుచూస్తుండగా.. రోగులు గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన అంకాలజీ, న్యూరాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, కార్డియాలజీ వంటి సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు కోసం ఎదురుచూస్తున్నారు.

ఇబ్బంది లేదు..

31 మంజూరు పోస్టులుండగా 20 మంది పనిచేస్తున్నారు. మిగిలిన 11 పోస్టులు ఖాళీగా ఉన్నా ఇబ్బందుల్లేవు. అసోసియేట్ ప్రొఫెసర్లు ఆయా విభాగాలకు ఇన్‌చార్జి హెచ్‌వోడీలుగా నియమించాం. ఇలా చూపేందుకు ఎన్‌ఎంసీ కూడా అనుమతినిచ్చింది.

– డాక్టర్ వెంకటాచలం, ప్రిన్సిపాల్, రిమ్స్ వైద్య కళాశాల.